# 3న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు పక్కా..

- నరకాసురుని పాలన నుంచి విముక్తి..
- పట్టణ అధ్యక్షులు దొడ్డ డానియల్, మున్సిపల్ చైర్మన్ డివి..



**ఇల్లందు,డిసెంబర్ 1(కెరటం ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్రంలో ప్రజలంతా మార్పు కోరుతున్నారని,టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి సారథ్యంలో డిసెంబర్ 3వ తేదీన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని ఇల్లందు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు దొడ్డ డానియల్,మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు.శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..గురువారం జరిగిన పోలింగ్‌లో రాష్ట్రంతో పాటు ఇల్లందు నియోజకవర్గ వ్యాప్తంగా మార్పు కోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోరం కనకయ్యకు స్నేహ భావంతో ప్రజలు పట్టం కట్టడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. 2014,2018 ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టిన విషయాన్ని గుర్తుచేశారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సైతం సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, జిల్లా పోదెం వీరయ్య, ప్రచార కో-చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో ప్రజలందరు సైతం మార్పు కోరుతున్నారన్నారు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ప్రజలందరు విసికి,వేసారి పోయారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆరు గ్యారంటీల మెనిఫేస్టోను అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే మార్పు వస్తుందని ఇల్లందు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం కోసం భవిష్యత్తు ప్రణాళిక రూపొం దించడం జరిగిందన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. డిసెంబర్ 3న కోరం కనకయ్య 30 వేల మెజారిటీతో విజయం సాధించి తీరుతామని, ముచ్చటగా మూడోసారి ఇల్లందులో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను బొంద పెట్టడానికి మద్దతు పలికిన సీపీఐ,టిడిపి, వైయస్సార్ టిపి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.గత నెల రోజుల నుంచి కాంగ్రెస్ పార్టీకి అహర్నిశలు కష్టపడి నిస్వార్థంగా కృషి చేసిన ఐ ఎన్ టి యు సి,మహిళ, ప్రజలకు యూత్ కాంగ్రెస్ నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ప్రధాన కార్యదర్శి జాఫర్,టిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ, సిపిఐ నాయకులు బంధం నాగయ్య, దేవర కొండ శంకర్,కాంగ్రెస్ నాయకులు ఈశ్వర్ గౌడ్, బొళ్ళ సూర్యం,మెహబూబ్,సుదర్శన్ కోరి, పింగళి నరేష్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.






## ఓటర్లను దిగజార్చిన ఘనత బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలదే..

**ఇల్లందు,డిసెంబర్ 1(కెరటం ప్రతినిధి)**

ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఓటర్లను డబ్బు పేరుతో ప్రలోభాలకు గురిచేసి దిగజార్చిన ఘనత బీఆర్ఎస్,కాంగ్రెస్ పార్టీలకే దక్కుతుందని ఎన్డి నాయకులు ఆవునూరి మధు,సాదినేని వెంకటేశ్వరరావు ఎమ్మెల్యే అభ్యర్థి సర్పంచ్ మోకాళ్ళ కృష్ణ ఆరోపించారు.శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..డబ్బులు ఇస్తేనే ఓట్లు వేస్తామని ప్రజలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడి చేసి ప్రజా ప్రతినిధులతో వాగ్వాదానికి దిగేలా ఓటర్లను బీఆర్ఎస్ పార్టీ దిగజార్చిందన్నారు.గడిచిన 30 ఏళ్ల కాలంలో ఓటర్లు ఏకపక్షంగా ప్రజా నాయకుడిని ఎన్నుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయని నాడు స్వచ్ఛందంగా ప్రజలు ఓటర్లు వారికి పని చేసే నాయకున్ని ఎన్నుకునే వారని అలాంటి పరిస్థితి నేడు నుండి ఓటుకు నోటు అనే స్థాయికి తీసుకురావడం భవిష్యత్తులో ప్రజా పాలన ప్రమాదకరంగా మారుతుందన్నారు. ఇలాంటి వ్యవస్థను అంతం చేసేందుకు ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.త్వరలో అధికారంలోకి వచ్చే ఏ పార్టీ అయినా ప్రజా సంక్షేమం కోసం పనిచేయాల్సిన అవసరం ఉందని ఇల్లందులో ఎవరు గెలిచిన కొమరారం,బోడు మండలాలను ఏర్పాటుతో పాటు ఇల్లందును రెవెన్యూ డివిజన్ గా మార్చాల్సిన అవసరం ఉందన్నారు అన్నారు.సీతారామయ్య,తుపాకుల నాగేశ్వరరావు, సర్పంచ్ సంతు, రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.



## 21వ ఉర్సు ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**ఇల్లందు,డిసెంబర్ 1(కెరటం ప్రతినిధి)**

మండల పరిధిలోని సత్యనారాయణపురం నాగుల్ మీరా మౌలా చాంద్ దర్గా 21వ ఉర్సు ఉత్సవాల పోస్టర్ ను శుక్రవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా దర్గా మాలిక్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ..కుల మతాలకు అతీతంగా ఎంతో భక్తి శ్రద్ధలతో ఉర్సు ఉత్సవాలను ఈనెల 11,12 తేదీలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 11 సాయంత్రం 5 గంటలకు హజరత్ ఖాసీం దూల్హా దర్గా షరీఫ్ నుంచి చాదర్ తీసుకురావడం జరుగుతుందని తెలిపారు.డిసెంబర్ 11న సాయంత్రం 6 గంటలకు సందల్ సమర్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. డిసెంబర్ 12న ఉదయం 8 గంటలకు నెంబర్ 2 బస్తీ హజరత్ ఖాసీం దూల్హా దర్గా షరీఫ్ నుంచి జూలూస్ ఉంటుందని,డిసెంబర్ 12న మధ్యాహ్నం 12 గంటలకు దావత్ హాజరత్,సాయంత్రం 6 గంటలకు సలామీతో ఉర్సు ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. రామకృష్ణ, శ్రీనివాస్,కుమార్,తిరుపతి,చింటూ రెడ్డి, అరవింద్, శ్రీనివాస్, సుమన్, సత్తిరెడ్డి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.



## శ్యామ్ బాబును పరామర్శించిన ఎండి.రజాక్

**కొత్తగూడెం, డిసెంబర్ 1(కెరటం ప్రతినిధి)**

టిబిజికెఎస్ నాయకులు, మాజీ సింగరేణి ఉద్యోగి శ్యాంబాబు సతీమణి జమున(55) అనారోగ్యంతో శుక్రవారం మరణించడం జరిగినది. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమార్తె సింగరేణి ఉద్యోగి. ఈ విషయం తెలుసుకున్న టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ రజాక్, వారి మిత్ర బృందంతో రామవరం ఎస్‌సిబి నగర్‌లోని వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూల మాల వేసి వారి ఆత్మకు శాంతి కలగాలని నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ రజాక్, ఎస్ కె గౌస్, చిలక రాజయ్య, పోశం శ్రీను భరత్, కవిరాజ్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.